




Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 166 | బుధవారం 03 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


### డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఉన్నప్పటికీ..

# 'గుజరాత్ మునిగిపోతోంది'

**- కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, డిసెంబర్ 02**

డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉన్నప్పటికీ.. గుజరాత్ మునిగిపోతోందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్‌లో 'డ్రగ్స్, అక్రమ మద్యం ముప్పు పెరిగిపోతోంది' అని మండిపడ్డారు. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న 'జన ఆక్రోశ్ యాత్ర' సందర్భంగా ప్రజలు, ముఖ్యంగా మహిళలు డ్రగ్స్, అక్రమ మద్యం, నేరాల ముప్పు పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. "గుజరాత్ మహాత్మాగాంధీ, సర్దార్



వల్లభాయి పటేల్ పుట్టిన భూమి. ఇక్కడ సత్యం, నైతికత, న్యాయం, సాంప్రదాయం ప్రబలంగా

- మిగతా 2లో..

# మేమిద్దరం అన్నదమ్ముల్లాంటి వాళ్లం

- సీఎం సిద్ధరామయ్య
- డీకే శివకుమార్ ఇంట్లో సీఎం సిద్ధరామయ్య అల్పాహార విందు భేటీ
- తామిద్దరం కలిసే ఉన్నామని స్పష్టం చేసిన ఇరువురు నేతలు
- సీఎం మార్పుపై అధిష్ఠానం, రాహుల్ గాంధీదే తుది నిర్ణయమని వెల్లడి
- అసెంబ్లీ సమావేశాలు, బీజేపీ వ్యూహాలపై చర్చించినట్లు ప్రకటన

**అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 02**

కర్ణాటక రాజకీయాల్లో ఆసక్తి రేపిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అల్పాహార విందు భేటీ ఇవాళ ఉదయం ముగిసింది. బెంగళూరులోని సదాశివనగర్‌లో ఉన్న శివకుమార్ నివాసంలో సుమారు గంటన్నర పాటు జరిగిన ఈ సమావేశం అనంతరం ఇరువురు నేతలు తాము ఐక్యంగా ఉన్నామని, కలిసికట్టుగా పనిచేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి



మార్పు అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం, రాహుల్ గాంధీ తీసుకునే ఏ నిర్ణయానికైనా కట్టుబడి ఉంటామని

- మిగతా 2లో..



## విశాఖలో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుసిటీ

- ఢిల్లీలో జీఎంఆర్‌ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేష్ భేటీ
- విశాఖ వద్ద ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటుపై విస్తృత చర్చ
- దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుసిటీ అభివృద్ధి ప్రణాళిక ఖరారు
- ఉత్తరాంధ్రకు గేమ్ ఛేంజర్ అవుతుందని అంచనా
- సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

2లో



## పరకామణి చోరీ కేసులో కీలక పరిణామం...

- హైకోర్టుకు నివేదిక సమర్పించిన సిట్
- సీల్డ్ కవర్‌లో నివేదికను సమర్పించిన సిట్ బృందం
- లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారంపై హైకోర్టు ఆదేశాలతో విచారణ
- మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డిని ప్రశ్నించిన సిట్
- శుక్రవారం కేసుపై తదుపరి విచారణ జరపనున్న హైకోర్టు

2లో

# ప్రధానమంత్రికి లేఖ రాస్తున్నాం

- సోనియా, రాహుల్ గాంధీలపై అక్రమ కేసులను ఖండిస్తూ లేఖ రాస్తామన్న రేవంత్ రెడ్డి
- నేషనల్ హెరాల్డ్ పేరుతో మనీలాండరింగ్ కేసులు పెట్టి వేధించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం
- కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలని నేషనల్ హెరాల్డ్ ప్రారంభించాలనుకున్నారని వెల్లడి

**హైదరాబాద్– సూర్య వాస్తవం, డిసెంబర్ 02**

సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై అక్రమ కేసులు బనాయించడాన్ని ఖండిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వారికి తెలంగాణ ప్రజలంతా అండగా ఉంటారని ఆయన భరోసా ఇచ్చారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తమ పార్టీ నేతలపై కేసులు పెడితే భయపడేది లేదని స్పష్టం చేశారు. దేశం కోసం




గాంధీ కుటుంబం ఎంతో త్యాగం చేసిందని ఆయన కొనియాడారు. సాధారణంగా ప్రైవేటు సంస్థల్లో పని చేసిన వారికి

- మిగతా 2లో..

### త్వరలోనే ఆర్టీసీకి

# 1000 ఈవీ బస్సులు



- విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రభుత్వ భవనాలపై సౌర ఫలకాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆమోదం
- వినియోగదారుడే విద్యుత్ ఉత్పత్తిదారుగా మారే విధానాలకు ప్రోత్సాహం
- గత ప్రభుత్వ పీపీఏల రద్దుతో ప్రజలపై రూ.9 వేల కోట్ల భారం పడిందన్న సీఎం

**అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 02**

రాష్ట్రంలో పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఆర్టీసీకి త్వరలోనే వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయాలని ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాబోయే ఐదేళ్లలో ఆర్టీసీ

- మిగతా 2లో..



## అమరావతిలో రెండో విడత ల్యాండ్ పూలింగ్..

- భూసేకరణకు ఉత్తర్వులు జారీ
- ఏడు గ్రామాల్లో 16,666 ఎకరాల సమీకరణకు ఉత్తర్వులు జారీ
- అమరావతి, తుళ్లూరు మండలాల పరిధిలో భూముల సేకరణ
- ప్రక్రియ వేగవంతం చేయాలని సీఆర్‌డీఏకు ప్రభుత్వ ఆదేశం

2లో




### ధాన్యం రైతుల సమస్యలకు చెక్..

## అందుబాటులోకి 1967 హెల్ప్‌లైన్

- మంత్రి నాదెండ్ల మనోహర్
- ధాన్యం కొనుగోలు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్
- రైతుల కోసం 1967 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ప్రారంభం
- ఈ ఖరీఫ్ సీజన్‌లో 11.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాల్లోకి రూ. 2,830 కోట్లు జమ చేసినట్లు మంత్రి వెల్లడి

2లో


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


### పవన్ మాటలను

# వక్రీకరించొద్దు

**- పవన్‌పై తెలంగాణ నేతల ఫైర్.. జనసేన క్లారిటీ..**

**అమరావతి– సూర్య వాస్తవం, డిసెంబర్ 02**

కోనసీమ పర్యటన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. పవన్ తమను అవమానించారంటూ తెలంగాణ రాజకీయ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తమను అవమానించారంటూ తెలంగాణ రాజకీయ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే.

- మిగతా 2లో..

## డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఉన్నప్పటికీ..

# 'గుజరాత్ మునిగిపోతోంది'

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. కానీ గత కొన్ని సంవత్సరాలుగా, రాష్ట్ర యువత భవిష్యత్తు మాదకద్రవ్యాలు మరియు నేరాల చీకటి ప్రపంచ వైపు నెట్టబడుతోంది" అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అధికారంలో ఉన్న వారి నుండి నేరస్థులకు రక్షణ లభిస్తున్నందున, వారు నిర్లక్ష్యం చేయబడటం వలనే మహిళలు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వస్తున్నారని అన్నారు. "గుజరాత్ అడుగుతోంది. బిజెపి ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది. ఏ బిజెపి మంత్రి వీటన్నింటికీ రక్షణ కల్పిస్తున్నారు. గుజరాత్‌కి దేశద్రోహం చేసేవారిని ఎందుకు కాపాడుతున్నారు" అని పేర్కొన్నారు.

జన ఆక్రోశ్ యాత్ర సమయంలో మరో ప్రధాన సమస్య రైతుల గురించి కూడా ప్రస్తావనకు వచ్చిందని అన్నారు. ఇటీవల వచ్చిన వినాశకరమైన వరదలు వేలాది గుజరాతీ కుటుంబాలను నాశనం చేశాయి. రైతుల పంటలను నాశనం చేశాయి. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, సహాయ ప్యాకేజీల గురించి మాట్లాడుతూనే ఉన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉన్నా.. నేడు గుజరాత్ మునిగిపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రధాని అయినప్పటికీ.. గుజరాత్‌కు తగిన ఉపశమనం లభించలేదని మండిపడ్డారు. గుజరాత్ ప్రజలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రతి కుటుంబం తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతోందని అన్నారు. రైతుల రుణాలను ఎందుకు మాఫీ చేయబడలేదు అని, డ్రగ్స్‌ను ఎందుకు అరికట్టడం లేదని ప్రతి కుటుంబం ప్రశ్నిస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆందోళనలను వింటూనే ఉంటుందని, బజెపి ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని నిరంతరం బయటపెడుతోందని అన్నారు.

# మేమిద్దరం అన్నదమ్ముల్లాంటి వాళ్లం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సీఎం సిద్ధరామయ్య.. "తాను, శివకుమార్ అన్నదమ్ముల్లాంటి వాళ్లం. పార్టీ కోసం ఎప్పుడూ కలిసే పనిచేస్తాం. శివకుమార్ ఎప్పుడు సీఎం అవుతారని కొందరు అడుగుతున్నారు. అధిష్ఠానం ఎప్పుడు నిర్ణయిస్తే అప్పుడే అవుతారు" అని బదులిచ్చారు. ఈ నెల 8 నుంచి జరిగే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలిపారు. బీజేపీ అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమవుతోందని, ఆ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటామని వివరించారు.

**సిద్ధరామయ్య కోసం ప్రత్యేకంగా నాటు కోడి వంటకాలు**

ఈ అల్పాహార విందు భేటీలో ఆహారం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సిద్ధరామయ్య కోసం ప్రత్యేకంగా ఇడ్లీ, ఆయన ఇష్టపడే 'నాటు కోడి పులుసు' సిద్ధం చేశారు. తాను మాంసాహారినని, శివకుమార్ శాకాహారి అని సిద్ధరామయ్య సరదాగా వ్యాఖ్యానించారు. "అసలైన నాటు కోడి ఇక్కడ దొరకదని, ఊరి నుంచి మంచి కోడిని తెప్పించమని శివకుమార్‌ను అడిగాను" అని ఆయన చెప్పడం నవ్వులు పూయించింది. శాకాహారి అయిన శివకుమార్ ఇడ్లీ, సాంబార్‌తో సరిపెట్టుకున్నారు. ఈ సమావేశంలో శివకుమార్ సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేశ్, ఎమ్మెల్యే హెచ్.డి. రంగనాథ్ కూడా పాల్గొన్నారు. సిద్ధరామయ్యకు డీకే సోదరులు ఘనస్వాగతం పలికారు. సురేశ్, రంగనాథ్ ముఖ్యమంత్రి పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ భేటీ ద్వారా తాము ఐక్యంగా ఉన్నామనే బలమైన సందేశాన్ని పార్టీ శ్రేణులకు పంపినట్లయింది.

# ప్రధానమంత్రికి లేఖ రాస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉండవని, కానీ ఎప్పుడో మూతబడిన నేషనల్ హెరాల్డ్ సిబ్బందిని మంచి ఆలోచనతో ఆర్థికంగా ఆదుకోవాలని సోనియా గాంధీ భావించారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలనే ఉద్దేశంతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పునరుద్ధరించే ప్రక్రియను చేపట్టారని పేర్కొన్నారు. పత్రికను నడిపేందుకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా కొంతమంది కాంగ్రెస్ నాయకులను తీసుకున్నారని అన్నారు. షేర్ క్యాపిటల్‌కు సంబంధించి కాంగ్రెస్ పార్టీ నుంచి నిధులు బదిలీ చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చారని, ఇందులో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి సంబంధించినది లేదని ఆయన అన్నారు. అదే సమయంలో ఎవరు కూడా జేబులో ఒక్క రూపాయి వేసుకోలేదని స్పష్టం చేశారు. నేషనల్ హెరాల్డ్ ఆస్తులన్నీ నెహ్రూవేనని ఆయన వ్యాఖ్యానించారు. వారసత్వంగా ఉన్న పత్రికను నడపాలని సోనియా గాంధీ భావించారని, కానీ మనీలాండరింగ్ కేసులు పెట్టి వేధించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మానసిక ధైర్యం కోల్పోకుండా సోనియా, రాహుల్ గాంధీలు కేసులను ఎదుర్కొన్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ ప్రచారాన్ని అడ్డుకోవాలని మళ్లీ కేసులు పెట్టారని అన్నారు.

## పవన్ మాటలను

# వక్రీకరించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

తమను అవమానించిన పవన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. పవన్‌పై విమర్శలు సైతం గుప్పిస్తున్నారు. ఇక, ఈ వివాదంపై జనసేన పార్టీ కార్యాలయం స్పందించింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో.. 'రాజోలు నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటించిన సందర్భంలో రైతులతో ముచ్చటిస్తూ చెప్పిన మాటలను వక్రీకరిస్తున్నారు. ఇరు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొన్న క్రమంలో ఆ మాటలు వక్రీకరించవద్దు' అని స్పష్టం చేసింది.

**పవన్‌కు రాజకీయాలు తెలీదు..**

తెలంగాణ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌కు రాజకీయాలు తెలియదని అన్నారు. తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలంటూ పవన్ కల్యాణ్‌ను ఆయన డిమాండ్ చేశారు. పవన్ క్షమాపణ చెబితే తెలంగాణలో ఆయన సినిమా ఒకటి, రెండు రోజులు ఆడుతుందన్నారు. లేకుంటే సినిమాలు ఆడవని మంత్రి కోమటిరెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## త్వరలోనే ఆర్టీసీకి

# 1000 ఈవీ బస్సులు

(మొదటి పేజీ తరువాయి)

బస్సులన్నింటినీ ఈవీలుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. దీనికి అనుబంధంగా రాష్ట్రవ్యాప్తంగా 5 వేల ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

మంగళవారం నాడు సచివాలయంలో విద్యుత్ శాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది పాటు ప్రోత్సాహకాలను పొడిగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై సుమారు రూ.1,053 కోట్ల భారం పడనుంది. రాష్ట్ర పారిశ్రామిక రంగంలో కీలకమైన ఈ పరిశ్రమలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు.

రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల (పీఎస్పీ) ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని, ఇందుకు జెన్‌కో, జలవనరుల శాఖ అధికారులు సంయుక్తంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు.

**60 రోజుల్లోనే పనులు ప్రారంభం కావాలి**

రాష్ట్రాన్ని ఒక 'న్యూ ఎనర్జీ హబ్'గా మార్చాలని ఆకాంక్షించిన చంద్రబాబు, ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ (ఐస్) పాలసీ కింద ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలు 60 రోజుల్లోనే తమ పనులను ప్రారంభించేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో 'పవర్ స్వాపింగ్' ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు.

**గత ప్రభుత్వ నిర్ణయాలతో రూ.9 వేల కోట్ల భారం**

గత పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని చంద్రబాబు విమర్శించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏ) రద్దు నిర్ణయంతో ప్రజలపై రూ.9 వేల కోట్ల భారం పడిందని, విద్యుత్‌ను వినియోగించుకోకుండానే కంపెనీలకు ఆ ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, సమర్థ నిర్వహణ ద్వారా విద్యుత్ ఛార్జీలు పెంచకుండానే ఆ భారాన్ని సున్నాకు తగ్గించగలిగామని వివరించారు. ఈ సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ కె.విజయానంద్, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌ల సీఎండీలు పాల్గొన్నారు.

## విశాఖలో దేశంలోనే

# తొలి ఏవియేషన్ ఎడ్యుసిటీ

**- ఢిల్లీలో జీఎంఆర్ ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేష్ భేటీ**

**- విశాఖ వద్ద ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటుపై విస్తృత చర్చ**

**- దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుసిటీ అభివృద్ధి ప్రణాళిక ఖరారు**

**- ఉత్తరాంధ్రకు గేమ్ ఛేంజర్ అవుతుందని అంచనా**

**- సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

న్యూఢిల్లీ– సూర్య వాస్తవం, డిసెంబర్ 02

ఆంధ్రప్రదేశ్‌లో ఏవియేషన్ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో విమానాశ్రయాల నిర్మాణ, నిర్వహణ దిగ్గజం జీఎంఆర్ సంస్థ సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. విశాఖపట్నం సమీపంలో దేశంలోనే మొట్టమొదటి 'ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ' అభివృద్ధిపై ఈ భేటీలో విస్తృతంగా చర్చించారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ భాగస్వామ్యంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర అభివృద్ధి ప్రణాళికను ఈ సందర్భంగా ఖరారు చేశారు. ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటుతో విశాఖ ప్రాంతం విమానయానం, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు సంబంధించిన విద్య, శిక్షణలకు జాతీయ హబ్‌గా మారనుంది. ఇందుకోసం ప్రత్యేక నైపుణ్యం కలిగిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను సైతం రాష్ట్రానికి తీసుకురానున్నారు. ఈ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చే గేమ్ ఛేంజర్ అవుతుందని, రాష్ట్రంలో ఏవియేషన్ క్లస్టర్ అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కీలక సమావేశంలో కేంద్ర పౌర విమా నయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో పాటు జీఎంఆర్ సంస్థ సీనియర్ అధికారులు ఎస్జీకే కిశోర్, సి.ప్రసన్న, పీయూష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పరకామణి చోరీ కేసులో

# కీలక పరిణామం...

**- హైకోర్టుకు నివేదిక సమర్పించిన సిట్**

**- సీల్డ్ కవర్‌లో నివేదికను సమర్పించిన సిట్ బృందం**

**- లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారంపై హైకోర్టు ఆదేశాలతో విచారణ**

**- మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డిని ప్రశ్నించిన సిట్**

**- శుక్రవారం కేసుపై తదుపరి విచారణ జరపనున్న హైకోర్టు**

అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 02

తిరుమల శ్రీవారి ఆలయం పరకామణిలో జరిగిన చోరీ కేసు దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. ఈ కేసుపై విచారణ జరిపిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మంగళవారం నాడు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు తన నివేదికను సమర్పించింది. సిట్ బృందానికి నేతృత్వం వహించిన సీఐడీ అదనపు డీజీ రవిశంకర్ అయ్యనార్, ఈ నివేదికను సీల్డ్ కవర్‌లో న్యాయస్థానానికి అందజేశారు. ఈ కేసుపై తదుపరి విచారణను హైకోర్టు శుక్రవారం చేపట్టనుంది.

2023 ఏప్రిల్‌లో తిరుమల పరకామణిలో టీటీడీ ఉద్యోగి రవికుమార్ 920 డాలర్లు దొంగిలిస్తూ పట్టుబడ్డాడు. ఈ ఘటనపై తిరుమల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే, అనూహ్యంగా ఈ కేసును లోక్ అదాలత్‌కు బదిలీ చేశారు. నిందితుడు రవికుమార్ తనకు చెందిన రూ.40 కోట్ల విలువైన ఏడు ఆస్తులను టీటీడీకి విరాళంగా ఇవ్వడంతో, 2023 సెప్టెంబర్‌లో కేసును రాజీ ఫార్ములాతో మూసివేశారు. అయితే, చిన్న దొంగతనం కేసుకు ఇంత పెద్ద మొత్తంలో ఆస్తులు విరాళంగా ఇచ్చి కేసును మూసివేయించడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనిపై మాచర్ల శ్రీనివాస్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లోక్ అదాలత్‌లో కేసును పరిష్కరించ డాన్ని సవాలు చేస్తూ, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు. పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, కేసుపై దర్యాప్తు చేయాలని ఆదేశించడంతో సిట్ విచారణ ప్రారంభించింది.

ఈ విచారణలో భాగంగా సిట్ అధికారులు.. కేసు నమోదైనప్పుడు టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న బి. కరుణాకర్ రెడ్డి, లోక్ అదాలత్‌లో పరిష్కారం జరిగినప్పుడు టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డిని, మాజీ ఈవో ధర్మారెడ్డితో పాటు పలువురు టీటీడీ, పోలీసు అధికారులను ప్రశ్నించి వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఇప్పుడు సిట్ సమర్పించిన నివేదిక ఆధారంగా హైకోర్టు తీసుకోబోయే నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## అమరావతిలో రెండో విడత

# ల్యాండ్ పూలింగ్..

**- భూసేకరణకు ఉత్తర్వులు జారీ - ఏడు గ్రామాల్లో 16,666 ఎకరాల సమీకరణకు ఉత్తర్వులు జారీ**

**- అమరావతి, తుళ్లూరు మండలాల పరిధిలో భూముల సేకరణ**

**- ప్రక్రియ వేగవంతం చేయాలని సీఆర్‌డీఏకు ప్రభుత్వ ఆదేశం**

అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 02

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. రెండో విడత భూ సమీకరణకు (ల్యాండ్ పూలింగ్) రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఏడు గ్రామాల్లో భూములను సమీకరించేందుకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియను చేపట్టాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ ఉత్తర్వులను విడుదల చేశారు. రెండో విడతలో భాగంగా రాజధాని పరిధిలోని అమరావతి, తుళ్లూరు మండలాల్లో మొత్తం 16,666.57 ఎకరాల భూమిని సమీకరించనున్నారు. ఇందులో 16,562.52 ఎకరాలు పట్టా భూములు కాగా, 104.01 ఎకరాలు అసైన్డ్ భూములుగా ఉన్నాయి. ఈ సమీకరణ పూర్తయ్యాక, అదనంగా 3,828.30 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా అందుబాటులోకి వస్తుంది. దీంతో రాజధాని అభివృద్ధి పనుల కోసం మొత్తం 20,494 ఎకరాలు సిద్ధం కానున్నాయి.

**సమీకరించనున్న భూముల వివరాలు:**

అమరావతి మండలం (7,465 ఎకరాలు): వైకుంఠపురం, పెద్దమద్దూరు, ఏంద్రాయి, కర్లపూడి లేమల్లే గ్రామాల్లో భూములను సమీకరించనున్నారు. తుళ్లూరు మండలం (9,097 ఎకరాలు): వడ్లమాను, హరిశ్చంద్రాపురం, పెద్దపరిమి గ్రామాల్లో భూ సమీకరణ చేపట్టనున్నారు. భూ సమీకరణ ప్రక్రియను వేగవంతం చేసి, తదుపరి చర్యలు తీసుకోవాలని సీఆర్‌డీఏ కమిషనర్‌కు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటికే మొదటి విడతలో భూములను సమీకరించగా, ఇప్పుడు రెండో విడత కూడా పూర్తయితే అమరావతిలో మౌలిక వసతుల నిర్మాణానికి అవసరమైన భూమి పెద్ద ఎత్తున అందుబాటులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

## ధాన్యం రైతుల సమస్యలకు చెక్..

# అందుబాటులోకి 1967 హెల్ప్‌లైన్

**- మంత్రి నాదెండ్ల మనోహర్ - ధాన్యం కొనుగోలు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్**

**- రైతుల కోసం 1967 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ప్రారంభం**

**- ఈ ఖరీఫ్ సీజన్‌లో 11.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ**

**- రైతుల ఖాతాల్లోకి రూ. 2,830 కోట్లు జమ చేసినట్లు మంత్రి వెల్లడి**

అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 02

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విజయవాడ కానూరులోని పౌరసరఫరాల భవనంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌తో పాటు, '1967' టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం ఆయన కంట్రోల్ రూమ్ పనితీరును పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 1,77,934 మంది రైతుల నుంచి కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు 11.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని వెల్లడించారు. ఇందుకుగాను రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 2,830 కోట్లు జమ చేసినట్లు వివరించారు. ధాన్యం విక్రయ ప్రక్రియలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసేందుకే ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చామన్నారు. రైతులు ధాన్యం రిజిస్ట్రేషన్, టోకెన్ల జారీలో జాప్యం, తూకంలో సమస్యలు, రవాణా, గోనె సంచుల కొరత వంటి ఏ సమస్య ఉన్నా 1967 నంబర్‌కు కాల్ చేయవచ్చని మంత్రి సూచించారు. ఈ హెల్ప్‌లైన్ సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుంది. ఫిర్యాదు చేసే సమయంలో రైతులు తమ ఆధార్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, టోకెన్ నంబర్, గ్రామ వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, పరిష్కారం అయ్యేవరకు అధికారులు ఫాలోఅప్ చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ ఆర్. గోవిందరావు, అడ్మిన్ మేనేజర్ జి. శిరీష, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆగని దాడులు..
# 70,000ను దాటిన మృతులు



**గాజా – సూర్య వాస్తవం, డిసెంబర్ 2:** రెండేళ్లకు పైగా ఇజ్రాయిల్ చేపడుతున్న అమానుష దాడుల్లో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 70,000ను దాటినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కాల్పుల విరమణ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు నమోదైన మొత్తం మరణాల సంఖ్య 356కి చేరినట్లు వెల్లడించింది. ఇజ్రాయిల్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూనే ఉంది. ఇజ్రాయిల్ సైన్యం దాడుల్లో 70,112మంది పాలస్తీనియన్లు మరణించగా, 1,70,000మందికి పైగా గాయపడ్డారని గాజాఆరోగ్య మంత్రిత్వ శాఖ నివేదించింది. కాల్పుల విరమణ సమయంలో కూడా, శిథిలాల నుండి మృతదేహాలను వెలికితీస్తున్నారని, పౌరుల లక్ష్యంగా ఇప్పటికీ దాడులు జరుగుతున్నాయని పేర్కొంది. అమెరికా మధ్యవర్తిత్వంతో అక్టోబర్ 10న కాల్పుల విరమణ ప్రారంభమైనప్పటికీ.. వారాంతంలో ఇజ్రాయిల్ దాడుల్లో భారీ ప్రాణనష్టం సంభవించిందని పేర్కొంది. వారాంతంలో మొత్తం మరణాల సంఖ్య 70,000 దాటిందని గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. జాతీయ మీడియా నివేదిక ప్రకారం.. శనివారం అల్–ఫరాబి పాఠశాల సమీపంలో ఇజ్రాయిల్ డ్రోన్లు జరిపిన దాడిలో దాడి చేసి, ఫాది మరియు జుమా టామర్ అబు అస్సీ అనే ఇద్దరు సోదరులు మరణించినట్లు తెలిపింది. ఆదివారం జరిగిన ఇజ్రాయిల్ దాడిలో ముగ్గురు పాలస్తీనియన్లు మరణించగా, ఇద్దరు గాయపడ్డారు. కాల్పుల విరమణ ఒప్పందం మొదటి దశలో భాగంగా.. ఇజ్రాయిల్ 15మంది పాలస్తీనియన్ల మృతదేహాలను గాజాకు తిరిగి తరలించింది. గత 40రోజులుగా గాజా భూభాగంలోని దక్షిణ భాగంలో 40మంది హమాస్ సభ్యులను చంపినట్లు ఇజ్రాయిల్ సైన్యం ఒక ప్రక టనలో తెలిపింది. నిరంతరం దాడులు, పెరుగుతున్న మరణాలు ప్రస్తుత కాల్పుల చుట్టూ ఉన్న అస్థిరతను, గాజా అంతటా పౌరులు ఎదుర్కొంటున్న నిరంతర ప్రమాదాలను ఎత్తి చూపుతోందని పాలస్తీనా జర్నలిస్ట్ అహ్మద్ అషాఫ్ పేర్కొన్నారు.

## మెరుపుదాడిలో ప్రభుత్వ అధికారి సహా నలుగురు మృతి



**ఇస్లామాబాద్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 2:** పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫక్తుంఖ్వాలో ఉగ్రవాదులు జరిపిన మెరుపుదాడిలో ప్రభుత్వ అధికారి సహా నలుగురు మరణించారు. మంగళవారం ఉదయం పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫక్తుంఖ్వాలో ఉత్తర వజీరిస్తాన్ అసిస్టెంట్ కమిషనర్ వాహనంపై ఉగ్రవాదులు మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు పోలీసులు సహా నలుగురు మరణించారు. బన్ను జిల్లాలోని కాంట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో .. ఉత్తర వజీరిస్తాన్ అసిస్టెంట్ కమిషనర్ షా వలియుల్లా వాహనం లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు ప్రాంతీయ పోలీస్ కమిషనర్ కార్యాలయ ప్రతినిధి నవాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈదాడిలో వలియుల్లా, ఇద్దరు కాని స్టేబుల్స్ సహా ఒక స్థానికుడు మరణించారని, మరో ఇద్దరు పోలీస్ అధికారులు గాయ పడ్డారని అన్నారు. బన్నులో జరిగిన ఉగ్రదాడిని ఖైబర్ ఫక్తుంఖ్వా ముఖ్యమంత్రి ముహమ్మద్ సొహైల్ తీవ్రంగా ఖండించారు. దేశ వ్యతిరేక శక్తులు ఇటువంటి పిరికి పంద చర్యల ద్వారా మన ధృడసంకల్పాన్ని దెబ్బతీయలేవని అన్నారు. ఈ ఘటనపైవివరణాత్మక నివేదికను ఇవ్వాల్సిందిగా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ను ఆదేశించారు.

## అణుయుద్ధం అనివార్యం

**- రాబోయే పదేళ్లలో వస్తుందంటూ మస్క్ వ్యాఖ్యలు**

**- నెట్టింట వైరల్ అయిన మస్క్ పోస్ట్**



**న్యూయార్క్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 2:** రానున్న పదేళ్ల కాలంలో అణు యుద్ధం అనివార్యమని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడూ ఎక్స్‌లో చురుగ్గా ఉండే మస్క్ త్వరలో ప్రపంచం యుద్ధ సంఘర్షణలో చిక్కుకుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హంటర్ యాష్ అనే ఎక్స్ యూజర్ తన ఖాతాలో ‘ శక్తివంతమైన దేశాలు అణ్వాయుధాలు కలిగి ఉండటంతో వాటి మధ్య యుద్ధాలు ఉండవని భావిస్తున్నాయి. ఇప్పుడున్న ప్రభుత్వాలు కూడా దాన్ని పిచ్చిగా నమ్ముతున్నాయి. కాబట్టి ఆ దేశాలపై బయటి శక్తుల ఒత్తిడి ఉండదు ‘ అంటూ పోస్ట్ పెట్టాడు. దీనిపై మస్క్ స్పందిస్తూ ‘ అణుయుద్ధం అనివార్యం. 5 సంవత్సరాలు లేదా గరిష్టంగా 10 సంవత్సరాలు ‘ అంటూ రాసుకొచ్చారు. అయితే నెటిజన్లు మస్క్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్నారు. అది నిజమైందా లేక ఫేక్ పోస్టా అని ఫ్యాక్ట్ చెక్ చేశారు. ఎక్కువ మంది గ్రోక్‌ని అడగ్గా అది యూరప్ సంక్షోభం, ప్రపంచ పరిణామాలపై గతంలో మస్క్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించింది..కొంత మంది నెటిజన్లు ఇది గుర్తింపు రాజకీయాల కోసమని అంటే మరికొంత మంది యూఎస్, చైనా మధ్య జరుగుతున్న సంఘర్షణలు, రష్యా– ఉక్రెయిన్ వార్ నేపథ్యంలో మరో ప్రపంచ యుద్ధం వస్తుందా ? అని చర్చ చేయడం గమనార్హం.

# ప్రతి పౌరుడినీ అనుమానంలోకి నెడుతున్నారు!

**- సామూహికంగా సవరణలు ఎలా చేపడతారు?**

**- వలసలు ప్రాతిపదిక కారాదు**

**- పౌరసత్వాన్ని పరిశీలించే అధికారాన్ని ఎలా తీసుకుంటారు**

**- ఎస్ఐఆర్‌పై పలు పిటిషన్లను విచారించిన సుప్రీం - 4కి వాయిదా**



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, డిసెంబర్ 2:** ఎన్నికల కమిషన్ ఇటీవల చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. పిటిషనర్ల తరపున న్యాయవాది ఎ.ఎం.సింఘ్వి వాదనలు వినిపిస్తూ, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(3) కింద నిర్వహించే ప్రత్యేక సవరణలు ఎవరికి వారికి వ్యక్తిగతంగా వుండాలి తప్పితే సామూహికంగా చేపట్టరాదని అన్నారు. వలస అనేది మానవుల లక్షణమని, దాన్ని ఎస్ఐఆర్‌కు ఒక ప్రాతిపదికగా వాడుకోరాదని అన్నారు. పైగా ఎస్ఐఆర్ ప్రక్రియ పౌరులను ‘ఊహాజనిత పౌరసత్వ జాబితా’లో వుంచుతోందని ఆయన వ్యాఖ్యానించారు. దీనికింద ఈ దేశంలో నివసించే ప్రతి పౌరుడూ తాను నిజంగా భారతీయ పౌరుడినే అని నిరూపించుకోవాల్సి వుంటుందని అన్నారు. ముందస్తు నోటీసులేవీ పంపకుండానే ఒక పౌరుడిని ‘గెస్ట్ లిస్ట్’లో పెడుతోందని అన్నారు. ఎన్నికల కమిషన్ తనకు తానుగా పౌరసత్వాన్ని పరిశీలించే అధికారాన్ని తీసుకుందని విమర్శించారు. జస్టిస్ బాగ్చి జోక్యం చేసుకుంటూ, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 25 కింద పేర్కొన్న పద్ధతిలో ఎస్ఐఆర్‌ను కచ్చితంగా నిర్వహించాలని ఏమైనా చట్టబద్ధమైన నిబంధనలు వున్నాయా? లేదా? మన అవసరాలు లేదా కారణాల ప్రాతిపదికన ఎస్ఐఆర్ నిర్వహణకు ఇసి చర్యలు తీసుకోవచ్చా? అని ప్రశ్నించారు. వేగంగా పెరిగిపోతున్న పట్టణీకరణ, తరచుగా వలసలు వెళ్లిపోవడం వల్లే ఎస్ఐఆర్ నిర్వహించాల్సిన పరిస్థితులు వచ్చాయని ఇసి చెబుతోందని, ఇవన్నీ సర్వసాధారణమైనవని అన్నారు. వలసలనేవి మానవ జీవితంలో అత్యంత సాధారణమైన అంశమన్నారు. పైగా భారతదేశంలో ఎక్కడ గ్రామీణ ప్రాంతం ముగుస్తుందో, ఎక్కడ పట్టణ ప్రాంతం ప్రారంభమవుతుందో తెలియదని అన్నారు. ఇటువంటి అంశాన్ని ఎస్ఐఆర్‌కు ప్రాతిపదికగా చేయలేమన్నారు.

**నియంతగా మారుతున్న ఇసి : ప్రశాంత్‌భూషణ్**

అనంతరం న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తన వాదనలు వినిపిస్తూ, ఓటర్ల జాబితాలను మెషిన్ రీడబుల్ ఫార్మాట్‌లో ఎందుకు వుంచరాదని, పారదర్శకతను ఎందుకు ఎంచుకోవడం లేదని ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిగా పౌరసత్వ పరీక్షగా వుందని వ్యాఖ్యానించారు. 1950లో తొలి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పరిశుద్ధమైన దేశం నుండి ఆ ఎన్నిక నిర్వహించింది. కానీ, ఇప్పుడు గతంలో ఎన్నడూ సిద్ధం చేయని రీతిలో ఓటర్ల జాబితాను ఎస్ఐఆర్ పేరిట కొత్తగా రూపొందిస్తోంది. ఎందుకు ఇంత హడావిడి? 30మంది బిఎల్ఓలు తమ ప్రాణాలను తీసుకునే పరిస్థితిని ఎందుకు సృష్టించారు?” అని ప్రశాంత్ భూషణ్ ప్రశ్నించారు. ఎన్యూమరేషన్ ఫారాలు భర్తీ చేయడానికి చిన్న చిన్న విండోలు, పైగా హడావిడిగా ఎస్ఐఆర్, మెషిన్ రీడబుల్ ఫార్మాట్‌ల్లో లేని ఓటర్ల జాబితాలు %ొ%.ఇసికి మీరు గనక అధికారాలు ఇస్తే, కచ్చితంగా నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఆయన వాదించారు. ఈ దశలో చీఫ్ జస్టిస్ జోక్యం చేసుకుని ప్రశాంత్ భూషణ్ తన వాదనలకే పరిమితం కావాలని సూచించారు. పలు పిటిషన్లపై వాదనలు విన్న అనంతరం ఈ నెల 4వ తేదీకి తదుపరి విచారణను బెంచ్ వాయిదా వేసింది.

**మూకుమ్మడి ఓటు తొలగింపు ఆరోపణలు తోసిపుచ్చిన ఇసి**

తమిళనాడులో 95.65 శాతం ఓటర్లు, పశ్చిమ బెంగాల్‌లో 99.77శాతం ఓటర్లు ఇప్పటికే తమ ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేసి అందజేశారని ఎన్నికల కమిషన్ సుప్రీం కోర్టులో వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేసింది. మూకుమ్మడిగా ఓట్ల తొలగింపు ఆరోపణలు తోసిపుచ్చింది. ఇప్పటివకే 58.7శాతం ఎన్యూమరేషన్ ఫారాలు తమకు అందాయని, వాటిని డిజిటలైజ్ చేశామని తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లో 30శాతం ఓటర్లను మినహాయించారని చేసిన వాదనలు ఇసి తిరస్కరించింది. బెంగాల్‌లో 70.14 శాతం ఫారాలు అందాయని తెలిపింది.

**అనుమానంతో దేశమే కాకుండా చేస్తారా ?**

”ఎస్ఐఆర్ ఒక వారసత్వ రికార్డును సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. ఇది తరతరాలుగా వ్యవస్థాగతంగా ఓటు హక్కును కోల్పోయేందుకు దారి తీస్తుంది.” అని న్యాయవాది వృందా గ్రోవర్ పేర్కొన్నారు. ”ఒక అనుమానం తలెత్తడమనేది ఓటు హక్కును నిరాకరించడమే కాకుండా, ఆ వ్యక్తికి తనదంటూ ఒక దేశం కూడా లేకుండా చేస్తుందా? ఒక అనుమానం, సందేహమే వారికి వారు వుండే దేశాన్ని లేకుండా చేస్తుంటే ఇక ఈ అధికారానికి ప్రాతిపదిక ఏమిటి? ” అని ఆమె ప్రశ్నించారు. ”ఎస్ఐఆర్ రాజ్యాంగ దార్శనికతను అసహనానికి గురి చేస్తోంది.” అని చెప్పారు.

# కేరళ వాదనల్లో న్యాయం ఉంది

**- ఎస్ఐఆర్ గణన పొడిగింపుపై ఈసీ లోతుగా పరిశీలించాలి సుప్రీంకోర్టు ఆదేశం**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, డిసెంబర్ 2:**

కేరళలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఈ నెల 13 తర్వాత కనీసం ఒక వారం రోజుల పాటు పొడిగించాలని కేరళ ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు చేస్తున్న అభ్యర్థనలు సరైనవేనని, వాటిల్లో న్యాయం వుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భారత ఎన్నికల కమిషన్ వాటిని లోతుగా పరిశీలించాల్సిన అవసరం వుందని అభిప్రాయపడింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఇసికి అభ్యర్థన పంపని పక్షంలో పొడిగింపునకు గల కారణాలను వివరిస్తూ ఒక లేఖను పంపాల్సిందిగా కేరళ ప్రభుత్వాన్ని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ మంగళవారం ఆదేశించింది. బుధవారానికల్లా ఇసికి ఈ అభ్యర్థన అందేలా చూడాలని పేర్కొంది. రాష్ట్రం చేసిన అభ్యర్థనలను సానుభూతితో, నిష్పాక్షికతతో రాబోయే రెండు రోజుల్లో పరిశీలించాల్సిందిగా ఇసిని కోర్టు కోరింది. కింది స్థాయి ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికలను ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్వహించుకునేందుకు అనుమతించాల్సిందిగా రాష్ట్రప్రభుత్వం, రాజకీయ పార్టీలు చేసిన అభ్యర్థనలను కూడా బెంచ్ పరిగణనలోకి తీసుకుంది.

941 గ్రామ పంచాయతీలు, 152 బ్లాక్ పంచాయతీలు, 14 జిల్లా పంచాయతీలు, 87 మున్సి పాలిటీలు, ఆరు కార్పొరేషన్లతో కూడిన 1200 స్థానిక స్వపరిపాలనా సంస్థల ఎన్నికలకు కేరళ సమాయత్తం అవుతోంది. మొత్తంగా 23,612 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. పని ఒత్తిడి భరించలేక ఇటీవల బూత్ లెవల్ అధికారులు కొంతమంది మరణిస్తుండగా, మరికొంతమంది బలవంతంగా ప్రాణాలు తీసు కుంటు న్నారని వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ గణన దశ గడువును ఈ నెల 4 నుంచి 11కి పొడిగించింది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ కేరళ ప్రభుత్వం, ప్రాంతీయ పార్టీలు, తమిళనాడు పాలక పార్టీ, పశ్చిమ బెంగాల్ నేతలు ఇలా అందరూ వేర్వేరుగా సుప్రీం కోర్టులో సవాలు చేశారు.

కేరళ సమస్య తక్షణమే విచారించాల్సిన అవసరం వుంది. ఒకపక్క ఎస్ఐఆర్, మరోపక్క స్థానిక సంస్థల ఎన్నికలు రెండూ ఒకేసారి జరగడం వల్ల పాలనాపరమైన ప్రతిష్టంభన దిశగా రాష్ట్రప్రభుత్వం పయనిస్తోందని కేరళ సర్కార్ పేర్కొంటోంది. రోజువారీ ప్రభుత్వ కార్యకలాపాలు సాగించడానికి సిబ్బంది ఎవరూ అక్కడ వుండని పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో ఎస్ఐఆర్‌ను తాత్కాలికంగా వాయిదా వేయాల్సిందిగా ఇసిని కోరేందుకు కోర్టు జోక్యం చేసుకోవాలని రాష్ట్రం కోరింది. స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ఈ నెల 9, 11 తేదీలు. ఓట్ల లెక్కింపు 13వ తేదీ, ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడానికి చివరి తేదీ ఈ నెల 18 అని కేరళ ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది సి.కె.శశి చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికల విధుల నిమిత్తం ప్రభుత్వ, క్వాసి ప్రభుత్వ సర్వీసులకు చెందిన 1,76,000మంది సిబ్బందిని మోహరించాల్సి వుంది. పైన మరో 68వేల మంది పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది కావాల్సి వుంటుంది. మరొకవైపు ఎన్నికల సంబంధిత కార్యకలాపాలు నిర్వహించుకు నేందుకు శిక్షణ పొందిన సిబ్బంది పెద్ద సంఖ్యలో 22,668మంది అవసరపడతారని పేర్కొంది. ఎస్ఐఆర్, స్థానిక సంస్థల ఎన్నికలకు అడ్డం కాదని భారత ఎన్నికల కమిషన్, కేరళ రాష్ట్ర ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు.

## పెరూ ఓడరేవులో కొండచరియలు విరిగిపడి
# 12మంది మృతి



**పెరూ– సూర్య వాస్తవం, డిసెంబర్ 2:** మధ్య పెరూలోని ఒక నది ఓడరేవు వద్ద రెండు పడవలు కొండచరియలు విరిగి పడటంతో సోమవారం ముగ్గురు పిల్లలు సహా కనీసం 12 మంది మరణించగా, మరికొంత గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. ఉకాయాలిలోని అమెజాన్ అడవి ప్రాంతంలోని ఇపారియా ఓడరేవు వద్ద కొండచరియలు విరిగిపడిన రెండు నౌకలు మునిగిపోయాయని ఆండినా వార్తా సంస్థ ఉదహరించిన పోలీసు నివేదిక తెలిపింది. బోటులో ఎంతమంది ఉన్నారో నిర్ధారించబడలేదు. కానీ సిఓఈఎన్ జాతీయ అత్యవసర కార్యకలాపాల కేంద్రం ఒకదానిలో దాదాపు 50 మంది ప్రయాణికులు ఉన్నారని, రెండవదానిలో ఎవరూ లేరని తెలిపింది. తొమ్మిది మృతదేహాలను వెలికితీయగా, 25 మంది గాయపడినట్లు నివేదించబడిందని చెప్పారు.

## బాలోత్సవం 2025లో అద్భుత ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య విద్యార్థులు
### - 20 విభాగాల్లో ఘన విజయం



**వేంపల్లె -సూర్య వాస్తవం, డిసెంబర్ 02 :** కడప నగరం మరియాపురం లోని సెయింట్ జోసెఫ్స్ బాలికల పాఠశాల వేదికగా నవంబర్ 29 మరియు 30 తేదీలలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలోత్సవం 2025 పోటీలలో శ్రీ చైతన్య విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారు. అకాడమిక్ మరియు సాంస్కృతిక విభాగాల్లో తమ ప్రతిభను చాటుకొని పలు విభాగాల్లో మెరిసి పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దాదాపు 6000 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలకు తమ పాఠశాల నుండి 120 మంది విద్యార్థులు 24 విభాగాల్లో పోటీ చేయగా, వారిలో 20 విభాగాల్లో అద్భుత విజయాలు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్, దేశభక్తి గీతాలు, డ్రాయింగ్, మట్టితో బొమ్మలు, స్టోరీ టెల్లింగ్, రైమ్స్, క్లాసికల్ డాన్స్, ఫాన్సీ డ్రెస్, వ్యాస రచన, బెస్ట్ ఫ్రం వేస్ట్, కార్టూన్ డ్రాయింగ్, మెమొరీ టెస్ట్ తదితర విభాగాల్లో విద్యార్థులు తమ కళా నైపుణ్యాలను చాటుకున్నారు.విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక రంగాల్లో కూడా రాణించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ విజయాల కోసం శ్రమించిన విద్యార్థులను, మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులను, సహకరించిన తల్లిదండ్రులను ఆయన అభినందిస్తూ భవిష్యత్తులో కూడా తమ పాఠశాల విద్యార్థులు చదువులో, క్రీడల్లో, సాంస్కృతిక విభాగాల్లో రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధిస్తారని హర్షం వ్యక్తం చేశారు.

## ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ
### - ప్రిన్సిపాల్ నాగేంద్ర








**వేంపల్లె -సూర్య వాస్తవం ,డిసెంబర్ 02 :** ఎయిడ్స్ వ్యాధి నివారణపై విధ్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర అన్నారు. మంగళవారం కళాశాల రెడ్ క్రాస్, రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పోస్టర్, పెయిటింగ్ ప్రజెంటేషన్, రంగోలి పోటిలు నిర్వహించారు. అనంతరం రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డా.సుధాకర్ మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూలనపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, దీని నివారణకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే వివిధ రకాల పోటిల్లో గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సతీష్, ఎన్ఎస్ఎస్ అధికారులు డా.ఓబుల్ రెడ్డి, డా.మల్లేశ్వరమ్మ, అధ్యాపకులు డా.గంగాధర్, డా.నాగలక్ష్మిదేవి, డా.రామకృష్ణ, అరవింద్, షఫివుద్దీన్, మాధవరావు, రాజారెడ్డి, రేష్మ, పీడీ తేజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గీతా జయంతి వేడుకలు
### - కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో భగవద్గీత పారాయణం

**వేంపల్లె -సూర్య వాస్తవం, డిసెంబర్ 02:** మూడు రోజుల పాటు జరిగిన గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్య మహిళలు భగవద్గీత పారాయణం చేశారు. అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో గణపతి పూజ, అష్టోత్రాలు, భగవద్గీత ఆవిర్భావ కథ శ్రవణం, పారాయణం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ మాట్లాడుతూ మానవులుగా ధర్మాన్ని పాటించి, బాధ, భయం వదిలి సొంత బాధ్యతలు నిర్వర్తించాలని కోరారు. భగవద్గీత కృష్ణ భగవాన్ బోధించిన జాన గ్రంథమని, హిందువులకు పరమ పవిత్రమైన గ్రంథాలలో ఒకటని అభిప్రాయపడ్డారు. అలాగే భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు మిట్టామోహన్, తదితర సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## రాబోయే రాష్ట్ర,
# జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాల నిర్వహణపై చర్చ



**రాయచోటీ-సూర్య వాస్తవం,డిసెంబర్ 2 :** రాయచోటి పట్టణంలోని రాష్ట్ర మంత్రి మండిపల్లి క్యాంపు కార్యాలయంలో జిల్లా క్రీడా అభివృద్ధికి సంబంధించిన కీలక విషయాలపై అన్నమయ్య జిల్లా జి. చంద్రశేఖర్, డీఎస్‌డీఓ, డీఎస్ఏలు మంగళవారంరాష్ట్ర రవాణా, యువ జన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమ క్షంలో సమగ్ర సమావేశం జరిగింది. ఈ సమా వేశంలో రాయచోటీ, మదనపల్లి రోడ్డులో 3ఎకరాల భూమి కేటాయింపు. డీఎస్ఏ అన్నమయ్య జిల్లాకు మల్టీ ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణం కోసం 3 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు ప్రతిపాదనను మంత్రి కి వివరించారు. జిల్లాలో ఇండోర్ స్పోర్ట్స్‌కు మౌలిక సదు పాయాల అభివృద్ధి అత్యవసరం అని మంత్రి తెలియ జేశారు. క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రస్తుతం జిల్లాలో అందుబాటులో ఉన్న పరిమిత సదు పాయాలు, అవసరాలు, అభివృద్ధి ప్రతిపాదనలు సమగ్రంగా వివరించారు. డీఎస్ఏ క్రికెట్ గ్రౌండ్, ఇండోర్ సదు పాయాలు, రన్నింగ్ ట్రాక్, ఇతర క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి అవసరమైన నిధులపై చర్చ జరిగింది. ఈ భూమి అభివృద్ధికి ప్రభుత్వ సహాయం కోరారు. జిల్లా క్రీడా కార్యక్రమాలు మరియు సమస్యలు డీఎస్ఏలో ఖాళీగా ఉన్న కోచ్ పోస్టులు, కార్యాలయ సిబ్బంది కొరత, నిధుల లభ్యత లోపం వంటి సమస్యలను వివరించారు. రాబోయే రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాల నిర్వహణపై కూడా చర్చ జరిగింది. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన మంత్రి జిల్లాలో క్రీడామౌలిక సదు పాయాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అభ్యర్థించిన భూమి కేటాయింపు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, డీఎస్ఏ సమ స్యల పరిష్కారంపై సానుకూలంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ముఖ్యమంత్రి వ్యాఖ్యలు హాస్యాస్పదం
### - నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి అమలు ఎప్పుడో!



**వేంపల్లె -సూర్య వాస్తవం ,డిసెంబర్ 02 :** సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ అని ఏపి సిఎం చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం అని ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్.తులసిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో అనేక హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదన్నారు. ఆ హామీల్లో ప్రధానమైన నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఇంకా అమలు కాలేదని, ఎప్పుడూ అమలవుతుందో! అని తులసిరెడ్డి ధ్వజమెత్తారు. వీటిని జనవరి నుంచేనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకు పెన్షన్ ఇస్తామని సూపర్ సిక్స్ హామీల్లో చెప్పారని, అబద్ధాలు చెప్పడం మానుకోవాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## విద్య - ఆరోగ్యం
## పర్యావరణ అంశాలపై అవగాహన




**వెంపల్లె -సూర్య వాస్తవం, డిసెంబర్ 02 :** విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిశుభ్రత వంటి అంశాలపై గ్రామ ప్రజలకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు అవగాహన కల్పించారు. మంగళవారం చక్రాయపేట మండలంలోని అంజనేయపురంలో ఎన్ ఎస్ ఎస్ యూనిట్-5 తరపున ఏడు రోజుల ప్రత్యేక శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక శిబిరంలో గ్రామ అభివృద్ధి, ప్రజా ఆరోగ్యం, విద్యా అవగాహన వంటి అనేక రంగాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం, హెల్త్ అండ్ న్యూట్రిషన్ - హెల్త్ ఈజ్ వెల్త్ అనే అంశంపై ఆరోగ్య అవగాహన కార్యక్రమం, విద్యావంచితులకు అవగాహన కల్పించే లిటరసీ క్యాంపెయిన్, మాదక ద్రవ్యాలు మరియు మద్యపాన దుర్వినియోగం వల్ల కలిగే హానికారక ప్రభావాలపై అవగాహన, ప్రభుత్వ పాఠశాల మరియు ఆంగన్వాడి వద్ద చెట్లు నాటడం మరియు నీటి సంరక్షణ కోసం డ్రిప్ సిస్టమ్ అమరిక, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి అభ్యర్థన మేరకు విద్యార్థుల కోసం అధ్యయనానికి ఉపయోగపడే లెర్నింగ్ ఎయిడ్స్ (డ్రాయింగ్ చార్ట్స్) తయారీ, ఐటిఐ విద్యార్థులకు స్కాలర్షిప్ పథకాలు మొదలైన వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శిబిరం ముగింపు సందర్భంగా మధ్యాహ్నం స్టేషన్లో ఎంఈవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమాలన్ని సమర్థవంతంగా నిర్వహించినందుకు ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏ. శ్రీకాంత్ రెడ్డి కృషిని మరియు వారి బృంద సభ్యుల సేవలను ఎంఈవో అధికారి అభినందించారు.


## వెలిగల్లు ప్రాజెక్టు కాలువకు గండి కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి
### - సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు



**లక్కిరెడ్డిపల్లి- సూర్య వాస్తవం, డిసెంబర్ 2:** వెలిగల్లు ప్రాజెక్టు కాలువకు గండి కొట్టిన ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలి అని సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్ధిగాల్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కాల్వకు గండి కొట్టిన ప్రాంతాన్ని ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వెలిగల్లు ప్రాజెక్టు ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు, వ్యవసాయానికి 24 వేల ఎకరాలకు, సాగునీరు అందించేందుకు నిర్మించిన అత్యంత కీలకమైన సౌకర్యం అన్నారు.

ఇటువంటి ప్రాజెక్టులకు హాని కలిగించే చర్యలు ప్రజల హక్కులను, రైతుల భవిష్యత్తును నేరుగా దెబ్బతీస్తాయి అన్నారు. ఇప్పటికే వెలిగల్లు ప్రాజెక్టు ప్రధాన కాలువకు కొంతమంది గండి కొట్టినట్లు వెలుగులోకి వచ్చిన విషయం తీవ్రంగా ఖండించదగినది. ఈ చర్య వల్ల కాలువ వ్యవస్థ దెబ్బతినడమే కాకుండా, కిందివైపు ఉన్న పలుచోట్ల సాగునీటి సరఫరా అంతరాయం కలగే ప్రమాదం ఉంది అన్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికార విభాగాలు వెంటనే దర్యాప్తు జరిపి, బాధ్యులైన వ్యక్తులను గుర్తించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్తుల నాశనం రాష్ట్ర అభివృద్ధిపై నేరుగా ప్రభావం చూపుతుంది అని తెలిపారు. వెలిగల్లు ప్రాజెక్టు కాలువల వద్ద భద్రతా చర్యలు పెంచి, నిరంతర పర్యవేక్షణను బలోపేతం చేయాలని సంబంధిత అధికారుల నిర్లక్ష్యం పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రజల నీటి హక్కు కోసం, రైతుల భవిష్యత్తు కోసం వెలిగల్లు వంటి ప్రాజెక్టులను రక్షించడం మనందరి బాధ్యత అని తెలుసుకొని భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ లక్కిరెడ్డిపల్లి మండల అధ్యక్షులు అవలకుంట నాగార్జున, సిపిఐ పందెలపల్లి,గ్రామ నాయకులు నాగేంద్ర, చరణ్, రైతులు పాల్గొన్నారు

## లక్కిరెడ్డిపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన నాగేంద్ర వరప్రసాద్ బాబు



**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం, డిసెంబర్ 2:** లక్కిరెడ్డిపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా బి నాగేంద్ర వరప్రసాద్ బాబు బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో రెడ్డయ్య మంగళవారం తెలియజేశారు. పెద్ద తిప్ప సముద్రం మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదోన్నతి పై జి.ఎస్.డబ్ల్యూ.ఎస్ డిప్యూటీ ఎంపీడీవోగా నాగేంద్ర స్పష్టం వరప్రసాద్ బాబు లక్కిరెడ్డిపల్లికు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని అనంతపురం,కుర్నూతుల, పందిళ్ళపల్లె గ్రామ సచివాలయాలను తనిఖీ నిర్వహించి, సచివాలయ సిబ్బంది పనితీరు పై ఆరా తీసినట్లు డిప్యూటీ ఎంపీడీవో నాగేంద్ర వరప్రసాద్ బాబు తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా సచివాలయ సిబ్బందికి అందుబాటులో ఉంటూ సమయపాలన పాటించాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,సచివాలయం సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



## రాజా సాబ్' రన్ టైమ్..
# ఇది కొంచెం రిస్క్ అనిపించట్లేదా?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సినిమా అంటేనే భారీతనానికి కేరాఫ్ అడ్రస్. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో వస్తున్న 'రాజా సాబ్' సినిమాపై అంచనాలు గట్టిగానే ఉన్నాయి. హార్రర్ కామెడీ జానర్ లో ప్రభాస్ ను చూడబోతున్నామనే ఆసక్తి ఫ్యాన్స్ లో ఉంది. అయితే సినిమా రిలీజ్ కు ఇంకా నెల రోజులకు పైగా సమయం ఉండగానే, ఇప్పుడు దీని రన్ టైమ్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆ నెంబర్ చూసి కొందరు ఆశ్చర్య పోతుంటే, మరికొందరు ఆందోళన చెందుతున్నారు.సాధారణంగా హార్రర్ కామెడీ సినిమాలు ఎంత క్రిస్ప్ గా ఉంటే అంత మంచిది. రెండు నుంచి రెండున్నర గంటల లోపు ఉంటేనే ఆ కిక్ ఉంటుంది. కానీ ఇప్పుడు వినిపిస్తున్న టాక్ ప్రకారం 'రాజా సాబ్' రన్ టైమ్ ఏకంగా 3 గంటల 15 నిమిషాలు ఉంటుందని బజ్ నడుస్తోంది. ఒక ఎంటర్టైన్మెంట్ సినిమాకు ఇంత నిడివి అవసరమా అనే చర్చ మొదలైంది. ఇది నిజంగానే కొంచెం రిస్క్ అనిపించట్లేదా అని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.గతంలో 'అర్జున్ రెడ్డి', 'ఆర్ఆర్ఆర్', రీసెంట్ గా 'యానిమల్' వంటి సినిమాలు మూడు గంటలకు పైగా ఉన్నా ఆడియెన్స్ ఆదరించారు. కానీ అవన్నీ ఎమోషనల్ ఉన్న డ్రామాలు లేదా భారీ యాక్షన్ సినిమాలు. కామెడీ ప్లస్ హరర్ జానర్ లో మూడుంబావు గంటల పాటు ప్రేక్షకుడిని కుర్చీలో కూర్చోబెట్టడం అంటే కత్తి మీద సాము లాంటిదే. ఎక్కడ ఏ మాత్రం ల్యాగ్ వచ్చినా ఫలితం తారుమారయ్యే ప్రమాదం ఉంది. దర్శకుడు మారుతి ఈ ఛాలెంజ్ ను ఎలా స్వీకరిస్తారో చూడాలి.అయితే ఈ నిడివి వెనుక మరో కారణం కూడా ఉండొచ్చు. ఇందులో ప్రభాస్ వింటేజ్ లుక్స్, ఫ్యాన్స్ కోరుకునే అంశాలు ఎక్కువగా ఉండటం వల్ల లెంగ్త్ పెరిగి ఉండవచ్చు. లేదా సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్, పాటలు రన్ టైమ్ ను పెంచి ఉండొచ్చు. కథ డిమాండ్ మేరకే ఇంత సమయం తీసుకున్నారని, ఎడిటింగ్ టేబుల్ దగ్గర ఇంకా మార్పులు జరిగే అవకాశం ఉందని ఇన్ సైడ్ టాక్.మరోవైపు అమెరికాలో ఈ సినిమా బుకింగ్స్ అప్పుడే మొదలయ్యాయి. సాధారణంగా రన్ టైమ్ ఎక్కువ ఉంటే రోజుకు పడే షోల సంఖ్య తగ్గుతుంది. ఇది ఓపెనింగ్స్ మీద ప్రభావం చూపిస్తుంది. అయినప్పటికీ డిస్ట్రిబ్యూటర్లు ఇంత ముందుగానే బుకింగ్స్ ఓపెన్ చేశారంటే, సినిమా అవుట్ పుట్ మీద వారికి గట్టి నమ్మకమే ఉండి ఉంటుంది. ప్రస్తుతానికి ఇది కేవలం అనుకుంటున్న రన్ టైమ్ మాత్రమే. సెన్సార్ పూర్తి అయ్యేసరికి ఫైనల్ కట్ లో చాలా మార్పులు ఉండొచ్చు. మూడు గంటల సినిమానా లేక ట్రిమ్ చేస్తారా అనేది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. ఏది ఏమైనా 'రాజా సాబ్' నిడివి విషయం మాత్రం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

## ఆంధ్ర కింగ్ తాలూకా:
# 'డెడ్ సీజన్' ఎఫెక్ట్ పై రామ్ క్లారిటీ



సినిమా బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్ చేయాలంటే కంటెంట్ ఎంత ముఖ్యమో, రిలీజ్ టైమింగ్ కూడా అంతే కీలకం. ఒక్కోసారి మంచి సినిమాలు కూడా రాంగ్ టైమ్ లో వచ్చి ఇబ్బంది పడుతుంటాయి. ఇప్పుడు ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని సినిమా విషయంలోనూ ఇదే చర్చ నడుస్తోంది. 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమాకు పాజిటివ్ టాక్ వచ్చినా, కలెక్షన్ల విషయంలో స్లో స్టార్ట్ దక్కింది. అయితే దీని వెనుక ఉన్న అసలు కారణాన్ని, సినిమా భవిష్యత్తును అంచనావేస్తూ చిత్ర యూనిట్ ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఇది కొంచెం రిస్క్ అనిపించట్లేదా? సాధారణంగా మాస్ సినిమాలు అంటే ఫైట్లు, పాటలే హైలైట్ అనుకుంటాం. కానీ దర్శకుడు మహేష్ బాబు పి. మాత్రం ఇందులో ఒక బలమైన ఎమోషన్ ను నమ్ముకున్నారు. ఒక స్టార్ హీరోకి, అభిమానికి మధ్య ఉండే బంధాన్ని వెండితెరపై ఆవిష్కరించిన తీరు చూసి జనాలు ఫిదా అవుతున్నారు. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ రామ్ నటన గురించి, ఆ రైటింగ్ లోని బలం గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటున్నారు. పది మందిలో తొమ్మిది మందికి సినిమా నచ్చిందంటే ఆ కంటెంట్ పవర్ ఏంటో అర్థమవుతుంది. గాలి తీసేస్తున్న బాక్సాఫీస్ హైదరాబాద్ లో జరిగిన థ్యాంక్ యు మీట్ లో నిర్మాత మైత్రీ రవి మాట్లాడుతూ వాస్తవ పరిస్థితిని వివరించారు. నవంబర్ చివరి వారం అంటే సినిమాలకు ఒక రకంగా అన్ సీజన్ లాంటిది. అందుకే తాము మొదటి రోజే భారీ ఓపెనింగ్స్ ను ఆశించలేదని క్లారిటీ ఇచ్చారు. ఒక మంచి ప్రయత్నం చేసినప్పుడు అది జనాల్లోకి వెళ్లడానికి కొంత సమయం తీసుకుంటుంది. సినిమా చూసిన వారు రాస్తున్న పెద్ద లెటర్స్, రివ్యూలే తమకు దక్కిన అసలైన విజయం అని రామ్ చెప్పుకొచ్చారు. స్టార్లందరికీ ఇది పాఠం సినిమాను ఇప్పుడే తక్కువ అంచనా వేయవద్దని, ఇప్పుడే కథ మొదలైందని రామ్ అంటున్నారు. ఎమోషనల్ గా కనెక్ట్ అయిన ఆడియెన్స్ థియేటర్లకు క్యూ కట్టడం ఖాయం. ప్రస్తుతం వస్తున్న ఆదరణ చూస్తుంటే, రాబోయే రోజుల్లో బుకింగ్స్ పెరుగుతాయనే కాన్ఫిడెన్స్ టీమ్ లో కనిపిస్తోంది. అందుకే ప్రమోషన్స్ ను ఆపకుండా, మరింత స్పీడ్ గా జనాల్లోకి తీసుకెళ్లాలని డిసైడ్ అయ్యారు. నిజాయితీగా తీసిన సినిమా ఎప్పుడూ ఫెయిల్ అవ్వదని, దానికి ఆడియెన్స్ సపోర్ట్ ఎప్పుడూ ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. స్లోగా మొదలైనా, లాంగ్ రన్ లో 'ఆంధ్ర కింగ్' సేఫ్ జోన్ లోకి వెళ్లే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. మరి రామ్ నమ్మకం ఏ మేరకు నిజమవుతుందో, ఈ ఎమోషనల్ డ్రామా బాక్సాఫీస్ రేసులో చివరికి ఎక్కడ నిలుస్తుందో వేచి చూడాలి.



# కోహ్లి, రోహిత్‌పైనే ఆశలు

- సిరీస్ ఇక్కడే సాధించాలి
- నేడు దక్షిణాఫ్రికాతో రెండో వన
- మధ్యాహ్నం 1.30గంఎల నుంచి



రాయపూర్ : తొలి వన్డేలో నెగ్గిన టీమిండియా ఒక రెండో వన్డేపై దృష్టి సారించింది. రారుపూర్ వేదికగా బుధవారం జరిగే రెండో వన్డేలో టీమిం డియా గెలిస్తే.. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను చేజిక్కించుకోనుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రాంచీ వేదికగా ఆదివారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా నెగ్గి 1-0 ఆధిక్యతలో నిలిచింది. హెూరాహెూరీగా జరిగిన తొలి వన్డేలో టీమిండియా 17 పరుగుల తేడాతో సఫారీ లను ఓడించి సిరీస్‌లో ఆధిక్యాన్ని సాధించింది. మంగళవారం రారుపూర్ చేరుకున్న టీమిండియా ఆటగాళ్లకు ఘన స్వాగతం లభించింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని చిన్నారులు చుట్టుముట్టి గులాబీలతో ఘనంగా స్వాగతం పలికారు. తొలి వన్డేలో గెలిచిన టీమ్ ఇండియా ఇప్పుడు రెండో వన్డేకి సిద్ధమవుతోంది. స్వదేశంలో దక్షిణాఫ్రికాకు టెస్టు సిరీస్‌ను చేజార్చుకున్న భారత జట్టు.. వన్డేల్లో మాత్రం శుభారంభం చేసింది.

**సూపర్ ఫామ్‌లో రోహిత్, కోహ్లీ: శ్రీకాంత్**

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను 2027 ఐసిసి వన్డే ప్రపంచకప్ వరకు టీమిండియాలో కొనసాగించాలని మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ సూచించాడు. వారి అనుభవం, నిలకడైన ప్రదర్శన జట్టుకు అత్యవసరం అని, వారిద్దరూ లేకుండా ప్రపంచకప్ గెలవడం కష్టమని, భారత క్రికెట్ జట్టుకు కష్టమని పేర్కొన్నాడు. వీరిద్దరూ దశా బ్దాలుగా సేవలు అందిస్తూ.. కీలకమైన పిల్లర్లుగా ఉన్నారని, వారి అంకితభావం, నిలకడైన ప్రదర్శన మిగిలిన ఆటగాళ్లకు మోటివేషన్ అని, ప్రస్తుతం జట్టులో యువ ఆటగాళ్లు ఎక్కువగా ఉన్నా.. మేనేజ్‌మెంట్ లేదా బిసిసిఐ ఈ ఇద్దరు ఆటగాళ్ల భవిష్యత్తుపై క్లారిటీ ఇవ్వాలని అన్నాడు. వారిద్దరూ లేని జట్టుతో తక్షణమే అద్భుతాలు సాధించడం కష్టమని, వారి కెరీర్ గురించి ఇప్పుడే ఒక నిర్ణయానికి రావడం సీనియర్ ఆటగాళ్లపై ఒత్తిడి పెంచడమేనని అన్నాడు.

యువ ఆటగాళ్ల కంటే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు నిలకడగా రాణిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా శ్రీకాంత్ గుర్తు చేశాడు. కోహ్లీ, రోహిత్ క్రీజ్‌లో 20 ఓవర్ల వరకు నిలబడితే, ప్రత్యర్థుల గెలుపు అవకాశాలు తగ్గుతాయని, ఒకే ఫార్మాట్‌కు పరిమితమైనప్పుడు రిథమ్ కొనసాగిం చడం కష్టమే అయినా%%% వారిద్దరూ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారని, ఫిజికల్ ఫిట్‌నెస్‌పైనా దృష్టి సారించారని శ్రీకాంత్ అన్నాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లీ కొనసాగుతున్నాడని, 37ఏళ్ల వయస్సులోనూ దూకుడుగా ఆడుతున్న టాప్ క్లాస్ ప్లేయర్ కోహ్లీ ప్రపంచకప్ ఆడితే టీమిండియాకు ఎంతో ప్రయోజనమని అభిమానులు కూడా కోరుకుంటున్నారని తెలిపాడు.

జట్లు(అంచనా):ఇండియా: కెఎల్ రాహుల్(కెప్టెన్, వికెట్ కీపర్), రోహిత్, కోహ్లి, జైస్వాల్, తిలక్ వర్మ, పంత్(వికెట్ కీపర్), సుందర్, గైక్వాడ్, జడేజా, కుల్దీప్/ప్రసిధ్, అర్ష్‌దీప్.

దక్షిణాఫ్రికా:బవుమా(కెప్టెన్), మార్‌క్రమ్, రికెల్టన్, ముల్డర్, జోర్జి, స్టబ్స్, వెరైయనె(వికెట్ కీపర్), యాన్సెన్, బోచ్, హార్మర్, మహరాజ్.

## క్వార్టర్స్‌కు భారత్
# ఎఫ్‌ఐహెచ్ ప్రపంచకప్ జూనియర్ హాకీ



చెన్నై: ఎఫ్‌ఐహెచ్ ప్రపంచకప్ జూనియర్ హాకీ క్వార్టర్‌ఫైనల్లోకి భారతజట్టు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన గ్రూప్-బి చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు స్విట్జర్లాండ్‌ను చిత్తుచేసింది. తొలి కార్టర్ ముగిసేసరికి 3-0గోల్స్ ఆధిక్యతలో నిలిచిన భారత్.. ఆ ఆధిక్యతను చివరి వరకు నిలుపుకొని విజయం సాధించింది. దీంతో గ్రూప్-బిలో భారతజట్టు టాప్‌లో నిలిచి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. రెండో క్వార్టర్‌లో భారత్ మరో గోల్ చేసి 4-0 ఆధిక్యతలో నిలిచింది. గ్రూప్-బి నామమాత్రపు మ్యాచ్‌లో చిలీ జట్టు 2-0గోల్స్ తేడాతో ఓమన్ ఓడించి 3వ స్థానానికే పరిమితం కాగా.. ఈ మ్యాచ్‌కు ముందే ఇండియా, స్విట్జర్లాండ్ జట్లు క్వార్టర్‌ఫైల్‌కు చేరాయి. మంగళవారం జరిగిన ఇతర లీగ్ మ్యాచుల్లో ఫ్రాన్స్ జట్టు 3-2 గోల్స్ తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. మేయర్ రాధాకృష్ణ హాకీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ హెూరాహెూరీగా సాగింది. ఈ గెలుపుతో గ్రూప్-ఎఫ్‌లో ఫ్రాన్స్ జట్టు అగ్రస్థానంలో నిలిచి క్వార్టర్స్‌కు చేరింది. ఇదే గ్రూప్‌లో ఉన్న ఆస్ట్రేలియా జట్టు 3-1గోల్స్ తేడాతో ద. కొరియాను చిత్తుచేసి 2వ స్థానంలో నిలిచి క్వార్టర్స్‌కు చేరింది. ఇక గ్రూప్-డిలో స్పెయిన్ జట్టు 13-0గోల్స్ తేడాతో నమీబియాను, బెల్జియం జట్టు 10-0తో ఈజిప్ట్‌ను ఓడించాయి. దీంతో స్పెయిన్ జట్టు 9పాయింట్లతో గ్రూప్-డిలో అగ్రస్థానంలో నిలువగా.. బెల్జియం 6పాయింట్లతో 2వ స్థానంలో నిలిచి క్వార్టర్‌ఫైనల్ బెర్త్ దక్కించుకుంది. మంగళవారం జరిగిన మరో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 11-0తో ఆస్ట్రియాను, ఇంగ్లండ్ జట్టు 3-1తో మలేషియాను ఓడించాయి. దీంతో ఈ గ్రూప్‌నుంచి నెదర్లాండ్స్, ఇంగ్లండ్ జట్లు 1, 2 స్థానాల్లో నిలిచి నాకౌట్‌కు చేరాయి. గురువారం నుంచి క్వార్టర్‌ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

# ద్విత్వ తుఫాను దెబ్బకు రైతులు కష్టాల్లో

## పంట నష్టాన్ని అంచనా వేస్తున్న వ్యవసాయ అధికారులు

**పెళ్లకూరు– సూర్య వాస్తవం, డిసెంబర్ 02:** ద్విత్వ తుఫాను పెళ్లకూరు మండలంలో రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బ తీసింది. ప్రత్యేకించి లిఎగువ చావాలి, దిగువ చావాలి, చెంబేడుపాలెంలి గ్రామాల పరిధిలో విస్తారంగా సాగుచేసిన పంటలు పూర్తిగా నీట మునిగిపోయాయి. వరి సహా పలు పంటల్లో భారీ నష్టం చవిచూసిన రైతులు ఆందోళనలో ఉన్నారు.ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు లినాగార్జున సాగర్లి మంగళ వారం ప్రభావిత గ్రామాలను సందర్శించి పంటల నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. పొలాలలో నీరు నిల్వ ఉండటం, మొక్కల కుళ్ళు, పూర్తిగా చెడిపోయిన పంట లను గమనించిన ఆయన, గ్రామంలోని రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు.ఆయన మాట్లాడుతూ "పెళ్లకూరు మండలంలో తుఫాను ప్రభావం గణనీయంగా ఉంది. ప్రతి గ్రామంలో ఎకరాల వారీగా నష్టాన్ని నమో దుచేసి, పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేసి త్వరితగతిన ప్రభుత్వానికి పంపిస్తాం. రైతులకు తగిన సహాయం అందేలా చర్యలు ప్రారంభించాం" అని తెలిపారు.రైతులు తమ పంట నీటమునిగిపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడించారు. సమస్యలను విన్న





అధికారులు, ప్రతి అర్హ రైతుకు నష్టం మేరకు పరిహారం అందించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. పర్యటనలో లిఆర్.ఎస్.కె. రహమత్, రైతులు శ్రీపతి చంద్రయ్య, పుల్లేటి చంచయ్య, రాఘవయ్య, గోపాల్లి, అలాగే ఎగువ చావలి, దిగువ చావలి, చెంబేడుపాలెం గ్రామాల రైతులు పాల్గొన్నారు.తుఫాను కారణంగా నీటమునిగిన పంటలు పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో, రైతులు ప్రభుత్వం త్వరితగతిన సహాయం అందించాలని కోరుతున్నారు.

# సిఐటియు ఆల్ ఇండియా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ




**తిరుపతి –సూర్య వాస్తవం, డిసెంబర్ 02:** సిఐటియు 18వ అఖిల భారత మహాసభల పోస్టర్ ను యశోద నగర్ లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. జయ చంద్ర, టి .సుబ్రమణ్యం మాట్లాడుతూ డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు సిఐటియు అఖిలభారత మహాసభలు విశాఖపట్నంలో జరుగు తున్నాయి. జనవరి 4వ తేదీ పెద్ద ఎత్తున జరుగుతున్న బహిరంగ సభకు ఉద్యోగ, కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు.మోడీ పాలనలో కార్మిక హక్కులకు భద్రత లేదని, పోరాడి సాధించుకున్న హక్కులను లేబర్ కోడ్స్ పేరుతో కాలరాస్తున్నాడని విమ ర్శించారు. దేశంలో ఉన్న80 కోట్ల కార్మికుల ప్రయో జనాలను పక్కనపెట్టి కార్పోరేట్ల ప్రయోజనాల కోసం, కార్మిక శక్తిని దోచుకోవడానికి ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటల పని విధానాన్ని తీసు కొచ్చారని అన్నారు.అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ నియంత పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. అఖిల భారత సిఐటియు మహాసభలలో ఉద్యోగ ,కార్మికులు ఎదుకుంటున్న సమస్యలపై చర్చించి దేశవ్యాప్త ఉద్య మాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తా మన్నారు. కనీస వేతనం 26వేలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, స్కీం వర్కర్లను, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను, టీటీడీలో పనిచేస్తున్న పదహారువేల మంది కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆందోళన చేపట్టక తప్పదు అన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ జి. బాలసుబ్రమణ్యం, పి మునిరాజా, కే వేణుగోపాల్, గండికోట నాగ వెంకటేష్, ఈ ఎస్ కుమార్, కె.గుణశేఖర్ జిల్లా కమిటీ సభ్యులు ఎన్.డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

### - సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రామానాయుడు




**తిరుపతి –సూర్య వాస్తవం, డిసెంబర్ 02:** పోరాటాల ద్వారానే అన్నీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రామానాయుడు స్పష్టం చేశారు. మంగళవారం మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సీపీఐ పార్టీ సభ్యుల రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు పి. మహేంద్ర అధ్యక్షతన బైరాగి పట్టెడ లోని సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ శిక్షణా తరగతులకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక, కష్టజీవుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఆవశ్యమని అన్నారు. కార్మికుల పనిగంటలు తగ్గింపు కోసం అనేక పోరాటాలు చేయడానికి కారల్ మార్క్స్ రచించిన కమ్యూనిస్టు ప్రణాళిక ఉపయోగ పడిందన్నారు 1925 డిసెంబర్ 26వ తేదీన కమ్యూనిస్టు పార్టీ కాన్పూర్ లో ఆవిర్భవించిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ప్రధాన ఎజెండా బ్రిటీష్ పాలకులు భారత దేశాన్ని వదిలి పోవాలని, దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం నినాద మిచ్చి పోరాడిందన్నారు.

దేశం లో అనేక రాజకీయ పార్టీలు పుట్టుకొస్తున్నాయి అధికారం లేకపోతే కనుమరుగవుతున్నాయి అన్నారు. ప్రాంతీయ పార్టీలు అన్నీ కేవలం అధికారం కోసం పుట్టినవే... ప్రజల కోసం నిరంతరం రాజీలేని పోరాటం చేస్తున్నది కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అన్నారు.సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం, కాంట్రాక్టు , అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు కోసం కార్మిక సంఘాల ను ఐక్య పరచి పోరాడేది సిపిఐ అని స్పష్టం చేశారు. ఎస్వీ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ కె వి రమణ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రతి పార్టీ సభ్యులు సైద్ధాంతికంగా రాజకీయంగా ఎదగాలని అందుకు అవసరమైన చైతన్యం కలిగి ఉండాలని, అలాంటి చైతన్యం కావాలంటే మార్క్సిజం ను అధ్యయనం చేయాలని సూచించారు. ఈ శిక్షణా తరగతులు ప్రారంభానికి ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య పార్టీ ఉద్యమ గీతాలను ఆలపించారు. ఈ శిక్షణా తరగతులు లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె రాధాకృష్ణ, జె విశ్వనాథ్, శాఖ కార్యదర్శిలు పి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### వెలిగల్లు కుడి కాలవ

## మరమ్మతులకు 20 కోట్లు ప్రతిపాదన



**లక్కిరెడ్డిపల్లి –సూర్య వాస్తవం, డిసెంబర్ 2 :** వెలుగల్లు కుడి కాలవ మరమ్మత్తులకు 20 కోట్ల రూపాయలు అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపిస్తున్నామని వెలిగల్లు ప్రాజెక్టు డి.ఈ కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లి మండలంలో వెలిగల్లు కుడికాలవను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిగల్లు ప్రాజెక్టు నుంచి 1.4 టిఎంసిల నీరును విడుదల చేశామని అయితే ప్రస్తుతానికి 75 చెరువులు పూర్తిగా నిండాయని ఇంకా నీరు వదిలే ఉన్నారు అని అయితే కొన్ని చెరువులకు నీరు సక్రమంగా వెళ్లడం లేదని దీంతో కుడి కాలవకు మరమ్మతులు చేయిస్తే సరాసరి చెరువులకు నీరు అందుతాయని ఆయన అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు కుడికాలవ,పిల్ల కాలువల మరమ్మతుకు 20 కోట్ల రూపాయలు అంచనాలతో ప్రతిపాదనలు పంపిస్తున్నామని ఆయన తెలిపారు. అంతేకాకుండా ప్రతి చెరువుకు నీరు అందించడం ప్రభుత్వం లక్ష్యంగా భావిస్తుందని అన్ని చెరువులకు నీరు నింపినంతవరకు వెలిగల్లు ప్రాజెక్టు నీరు అందిస్తామన్నారు. కుడి కాలవకు పిల్ల కాలువలు పూర్తి మరమ్మతులు నోచుకుంటే ప్రతి ఎకరాకు వెలుగులు ప్రాజెక్టు నీరు చేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వెలిగల్లు ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు పళ్ళ మొక్కలు పంపిణీ



**గాండ్లపెంట –సూర్య వాస్తవం ,డిసెంబర్ 2 :** మండల కేంద్రంలో 02-12-2025 వ తేదిన రెడ్స్ సంస్థ గాండ్లపెంట మండలం కటారుపల్లి క్రాస్ నందు రైతులకుఉచ్చితంగా పళ్ళ మొక్కలు పంపిణి చేసే కార్యక్రమం నిర్వ హించడం జరిగింది ఈ కర్యక్రమానికి ముఖ్య అతి తులుగా కదిరి రెవెన్యు డివిజన్ ఆఫీసర్ శర్మ కదిరి డివిజనల్ అగ్రికల్చర్ ఆఫీసర్ సనావుల్లా గాండ్లపెంట అగ్రికల్చర్ ఆఫీసర్ సాదాబ్ సే ట్రీస్ నుండి ఉమేష్ అరుణ్ కుమార్ గారు పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి రెడ్స్ సంస్థ డైరెక్టర్ భానుజా అధ్యక్షత వహించి తాను మాట్లాడుతూ రెడ్స్ సంస్థసే ట్రీస్ సంస్థ వారిసహకారంతో గత నాలుగుసం వత్రరాలుగా 4 లక్షల మొక్కలు ఉచ్చి తంగా పంపిణి చేయడం జరిగింది గత సంవతరం మొక్కలు నాటుకున్న రైతులకు గ్యాప్ ప్లాంట్ సన్ క్రింద మొక్కలు ఇస్తూ ఈరోజు మొక్కలు నాటుకున్న రైతులకు యాజమాన్యం పైన శిక్షణ ఇవ్వడం జరిగు తుంది తరివాత మొక్కలు పంపిణి చేయడం జరుగు తుంది అని తెలిపినారు. మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం లోనే కదిరి ప్రాంతం పళ్ళ మొక్కలు సాగుచేయుటకు అనువైన భూములు మంచి నాణ్యమైన పళ్ళు దిగుబడిని ఇస్తాయి రైతులు పళ్ళ మొక్కలు పెచుకోవడం వలన దీర్ఘకాలగా ఆదాయం పొంద వచ్చు కాలుష్యాన్ని తగ్గించాలంటే మొక్కలు నాటడమే పరిష్కారం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని కాపాడు కోవాలని తెలిపినారు. మాట్లాడుతూ పళ్ళ మొక్కలలో అంతర్ పంటలు సాగు చేయవచ్చును పొలాలను బీడులునా పెట్టకుండా పళ్ళ మొక్కలు పెంచడం వలన రైతులకు మంచి ఆదాయం వస్తుందని తెలిపినారు ఉమేష్ పళ్ళ మొక్కల యాజమాన్యం గురించి శిక్షణ ఇచ్చినారు తరువాత125 మంది రైతులకు పళ్ళ మొక్కలు పంపిణి చేయడం జరిగింది.

### రెక్క మానులో రైతన్న

## మీకోసం గ్రామ సభ



**గాండ్లపెంట –సూర్య వాస్తవం ,డిసెంబర్ 2 :** మండలంలోని రెక్క మాను గ్రామంలో డిసెంబర్ మూడవ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు రైతన్న మీకోసం కార్యక్రమం సందర్భంగా రైతు సేవ కేంద్రాల్లో జరుగుతున్న గ్రామసభల భాగంగా ఏవో సయ్యద్ మాట్లాడుతూ... రెక్క మాను(కురుమామిడి) గ్రామ సభకి కదిరి నియోజవర్గ శాసన సభ్యులు గౌరవ "శ్రీ కందికుంట వెంకటప్రసాద్ గారు 3/12/25 వ తేదీన ఉదయం 10.00 ఏయమ్‌కి పాల్గొంటారు.కావున సర్పంచ్ ,ఎంపీటీసీ, యమ్‌పీపీ , జడ్‌పీటీసీ , టిడిపి, బీజేపీ, జనసేన కార్యకర్తలు, గ్రామ రైతులు, పత్రిక విలేఖరులు అందరూ పాల్గొనాల్సిందిగా కోరుతున్నాము.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )